వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 237
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జూన్ 20, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


8లో..

## గాజర్ల రవికి కన్నీటి వీడ్కోలు

- పెద్దఎత్తున తరలి వచ్చిన జనం
- అంతిమ యాత్రలో పాల్గొన్న అభిమానులు, సానుభూతిపరులు
- నివాళులర్పించిన సిరికొండ..

# కోర్టులో.. బాంబు

జిల్లా న్యాయస్థానాల భవన సముదాయంలో కలకలం


వివరాలు2లో..





- 100 కి ఫోన్ చేసి చెప్పిన అగంతకుడు
- అప్రమత్తమైన పోలీసులు
- బాంబ్, డాగ్ స్కాడ్ తో విస్తృత తనిఖీలు
- కోర్టు ప్రాంగణంలో 6 డిటొనేటర్ల స్వాధీనం
- ఆందోళనలో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బంది

హనుమకొండలోని జిల్లా న్యాయస్థానాల భవన సముదాయంలో బాంబు పెట్టినట్లు ఫోన్ కాల్ రావడం కలకలం రేపింది. న్యాయస్థానాల్లో బాంబు పెట్టామంటూ శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి 100 కు కాల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో కోర్టుకు చేరుకున్న సుబేదారి పోలీసులు కోర్టు ప్రాంగణాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కోర్టు ప్రాంగణంలో ఉన్న ఏ ఒక్కరినీ బయటకు పోకుండా అడ్డుకున్నారు. గేట్లు మూసివేసి అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురి వద్ద ఉన్న భ్యాగులనూ తనిఖీ చేశారు. దీంతో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బందితోపాటు వివిధ కేసుల్లో కోర్టుకు వచ్చిన వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కోర్టు ప్రాంగణంలోని వాహనాల స్టాండ్ లోనూ తనిఖీలు నిర్వహించారు. కోర్టు ఆవరణలో ఉన్న ఆరు డిటొనేటర్లను పోలీసులు  స్వాధీనం చేసుకున్నారు. అయితే బాంబు బెదిరింపు కాల్ కు ఈ డిటొనేటర్లతో ఎలాంటి సంబంధం లేదంటూ పోలీసులు, కోర్టు సిబ్బంది ప్రకటిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ



# భద్రకాళి బోనాలపై రగడ

- ఈ విషయంలో పునరాలోచన చేయాలి
- గతంలో ఎన్నడూ లేదన్న ఎమ్మెల్యే నాయిని

ఓరుగల్లు ప్రజల ఇలవేల్పుగా వెలుగొందుతున్న భద్రకాళి అమ్మవారికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల 22న బంగారు బోనం సమర్పించడంపై వివాదం నెలకొంది. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకే బోనం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటిస్తున్నా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితోపాటు పలువురు దీనిని వ్యతిరేకిస్తున్నారు. భద్రకాళి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్న నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బోనం విషయంలో మంత్రి సురేఖ పునరాలోచన చేయాలని కోరారు. గ్రామ దేవతలకు మాత్రమే తెలంగాణలో బోనం సమర్పించే ఆచారం ఉందన్నారు. భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పణపై అనేక ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఆలయ అధికారులు, దేవాదాయ శాఖ ఈ ప్రతిపాదనను విరమించుకుంటే మంచిదని సూచించారు.

- వరంగల్ వాయిస్, వరంగల్


2లో..

## ఎడ్లపల్లిలో పెద్దపులి

- పాద ముద్రలు గుర్తించిన కొయ్యూరు ఫారెస్ట్ అధికారులు


8లో..

## మెడికల్ హబ్‌గా వరంగల్

- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- రాజేందర్ రెడ్డి, సుధారాణిలతో కలిసి ఎంఆర్‌యూ ప్రారంభం

# కోర్టులో బాంబు










- **జిల్లా న్యాయస్థానాల భవన సముదాయంలో కలకలం**
- **100 కి ఫోన్ చేసి చెప్పిన అగంతకుడు**
- **అప్రమత్తమైన పోలీసులు**
- **బాంబ్, డాగ్ స్కాడ్ తో విస్తృత తనిఖీలు**
- **కోర్టు ప్రాంగణంలో 6 డిటొనేటర్ల స్వాధీనం**
- **ఆందోళనలో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బంది**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానాల భవన సముదాయంలో బాంబ్ కలకలం రేపింది. కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకుడు డయల్ 100 నెంబర్‌కి ఫోన్ చెప్పడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబ్, డాగ్ స్కాడ్ తో అక్కడికి చేరుకున్న సుబేదారి పోలీసులు కోర్టు ప్రాంగణాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. న్యాయవాదులు, లాయర్లు, సిబ్బందితోపాటు వివిధ కేసుల్లో కోర్టుకు వచ్చిన వారెవ్వరినీ బయటకు పోకుండా గేటుకు తాళం వేశారు. కోర్టు పరిసర ప్రాంతాలను పోలీసులు బాంబ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. కోర్టులో బాంబు పెట్టిన విషయం దావానలంలా వ్యాపించడంతో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అయితే అప్రమత్తమైన పోలీసులు వారికి అక్కడినుంచి పంపించివేశారు.

### విస్తృత తనిఖీలు..

ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఐదు జిల్లా కోర్టులు, రెండు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు, ఏడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మొత్తం 14 కోర్టులు పనిచేస్తున్నాయి. వీటిలో వందల సంఖ్యలో న్యాయవాదులు, లాయర్లు, సిబ్బంది పనిచేస్తున్నారు. అదే విధంగా నిత్యం వివిధ కేసుల్లో కోర్టు వచ్చే వారు, వారిని తీసుకొని వచ్చే కోర్టు కానిస్టేబుల్స్, శిక్ష అనుభవిస్తున్న వారి బంధువులు ఇలా అనేక మంది కోర్టుకు వస్తుంటారు. కోర్టు ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఫోన్ రావడంతో వారంతా ఒక్కసారిగా ఖంగుతిన్నారు. మధ్యాహ్నం ప్రారంభమైన పోలీసుల తనిఖీలు సాయంత్రం వరకు సాగడంతో ఏమైనా జరుగుతుందోమోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. అయితే ఇటీవలి కాలంలో బాంబు బెదిరింపు కాల్ రావడం ఇది మూడో సారిగా పలువురు చెప్పుకోవడం గమనార్హం.

### 6 డిటొనేటర్ల స్వాధీనం..

కోర్టు ఆవరణలో ఉన్న ఆరు డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. అయితే బాంబు బెదిరింపు కాల్ కు ఈ డిటోనేటర్లతో ఎలాంటి సంబంధం లేదంటూ పోలీసులు, కోర్టు సిబ్బంది ప్రకటిస్తున్నారు. ఆత్మకూరుకు చెందిన ఓ కేసు విషయంలోనే వీటిని కోర్టు ప్రాంగణలోకి తీసుకొచ్చినట్లు వారు చెబుతున్నారు. ఏది ఏమైనా కోర్టులో బాంబు కలకలం రేపడం.. ఆరు డిటోనేటర్లు లభించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

# నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యక్తిపై పీడీ యాక్ట

- **ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సన్ ప్రీత్ సింగ్**
- **రాష్ట్రంలోనే తొలిసారి కేసు నమోదు**




**వరంగల్ వాయిస్, క్రైం :** రాష్ట్రంలోనే తొలి సారిగా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పీడీ యాక్ట్ నమోదు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులతో పాటు కాలం తీరిన మందులను విక్రయించిన వరంగల్ మట్టెవాడ ప్రాంతానికి చెందిన ఇరుకుళ్ల వేద ప్రకాష్ ను ఇటీవల అదుపులోకి తీసుకొని పరకాల జైలుకు తరలించారు. ఈ మేరకు సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేయగా ఉత్తర్వులను మట్టెవాడ ఇన్ స్పెక్టర్ గోపి పరకాల జైలులో ఉన్న నిందితుడు వేద ప్రకాశ్ కు అందజేశారు. అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. వేద ప్రకాశ్ మరో ఆరుగురు నిందితులతో కలసి ఒక ముఠాగా ఏర్పడి.. కాలం తీరిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుంచి తక్కువ డబ్బుకు కొనుగోలు చేయడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తుండగా మట్టెవాడ పోలీసులకు ఏప్రిల్ 7 న అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి పోలీసులు సుమారు రూ.49.52 లక్షల విలువ కలిగిన నకిలీ విత్తనాలు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మే 26న నకిలీ పురుగు మందులు విక్రయిస్తుడగా మట్టెవాడ పోలీసులు మరో మారు అరెస్ట్ చేసి అతని నుంచి రూ.11వేల విలువైన నకిలీ పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో కూడా కేసులు నమోదు అయినట్లు సీపీ వెల్లడించారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, పరుగు మందులను విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు. అలాగే ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సెల్ నెంబర్ 7799848333 కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ కోరారు.



# ఎడ్లపల్లిలో పెద్దపులి



- **పాద ముద్రలు గుర్తించిన కొయ్యూరు ఫారెస్ట్ అధికారులు**

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బొగ్గుల వాగు శివారులో శుక్రవారం పెద్దపులి పాద ముద్రలు కనుగొన్నట్లు కొయ్యూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేశ్వర్ రావు తెలిపారు. గత మూడు రోజులుగా మండలంలో రుద్రారం, ఎడ్లపల్లి, శత్రాజ్ పల్లి, తాడిచెర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీ సిబ్బంది ప్రకటించారు. రెండు రోజుల క్రితం మండలంలోని ఎడ్లపల్లి గ్రామ రైతు రాజయ్యకి చెందిన లేగ దూడ మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా పులి దాడి చేసి చంపేసినట్టు వారు తెలిపారు. పులి సంచారం నేపథ్యంలో మండల ప్రజలు, పశువుల కాపరులు, ఉపాధి కూలీలు జాగ్రత్తగా ఉండాలంటూ కొయ్యూరు ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా పులి కనిపిస్తే అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని వారు సూచించారు.



# యోగం!

### ఓ.. నిరంతర మానసిక, శారీరక, ఆధ్యాత్మిక వికాస ప్రక్రియ

యోగమనేది పురాతనమైనా నేడది ఆధునిక ఓ జీవన విధానం. యోగమనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధన దిశగా నడిచే ఓ.. నిరంతర ప్రక్రియ. మనస్సును, శరీరాన్ని అనుసంధానించే ఓ పురాతన కళ. భారతదేశంలో ఉద్భవించిన యోగా అనే ఈ పదం సంస్కృతం నుంచి ఉద్భవించింది. దీని అర్థం ఏకం చేయడం. ఇది శతాబ్దాల నాటి నుంచే ఆరోగ్యకరమైన జీవనానికి ఓ మార్గదర్శి. యోగా అనే పదం మొదట ఋగ్వేదం అని పిలువబడే పురాతన పవిత్ర గ్రంథంలో ప్రస్తావించబడింది. వేదాలు సంస్కృతంలో వ్రాయబడిన నాలుగు పురాతన గ్రంథాల సమితి. యోగ భంగిమలు (ఆసనాలు) కండరాలను సాగదీయడానికి, బలోపేతం చేయడానికి దోహదపడతాయి. యోగం మరీ ముఖ్యంగా ఒత్తిడి, నీరసం, నిస్పృహ, వ్యతిరేక ఆలోచన, అవధానశక్తి తరుగుదల లాంటి మనోవైకల్యాలను నివారిస్తుంది. యోగాసనం క్రమం తప్పకుండా చేసే వ్యక్తుల్లో ఆత్మవికాసం, సంపూర్ణ ఆరోగ్యం, శక్తి, తేజస్సు చురుకుదనం లాంటి తేజోగుణాలెన్నో వృద్ధి చెందడంతో పాటుగా దీర్ఘకాలిక రోగాల బారి నుంచి పరిరక్షించబడటం, సౌందర్యానుభూతికి లోనుకావటం లాంటి సాత్విక మార్పులెన్నో కూడా ఒనగూరుతాయి. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా చైతన్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి గాను కంకణబద్ధులై ఓ చారిత్రక నిర్ణయం తీసుకోవడంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విశాఖనగరంలో ఐదు లక్షల మందితో యోగా విశ్వమహాదివ్యదర్శనం దిశగా అడుగులు వేయటాన్ని, ఇందుకు భారత ప్రభుత్వం చేయూతతో పాటు ప్రోత్సాహాన్నివ్వడాన్ని మనం సర్వులమూ వారికి కృతజ్ఞతగా హర్షాతిరేకాలు తెలియజేద్దాం!


**- పరాంకుశం రఘు నారాయణ**

**గ్రామం : తొర్రూరు, జిల్లా : మహబూబాబాద్**
**ఫోన్ : 9949749987**

# పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

## ● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్థానిక శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 49వ డివిజన్‌లో రూ. 41 లక్షల అంచనా వ్యయంతో రెవెన్యూ కాలనీ నుండి ఆటో స్టాండ్ జంక్షన్ వరకు సెంటర్ లైటింగ్ సిస్టమ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికీ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. ఈ రోజు ప్రారంభించిన సెంటర్ లైటింగ్ సిస్టమ్ ద్వారా రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన రహదారి భద్రత లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి శుక్రవారం కాపువాడలో సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ



కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా చూడటం మా ప్రభుత్వ ధ్యేయం. అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ. ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు, నీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నాను" అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి కాలనీలో పర్యటించారు. స్థానిక ప్రజలతో సంభాషిస్తూ అక్కడి డ్రైనేజీ వ్యవస్థను స్వయంగా పరిశీలించారు. నీటి నిల్వలు, మురుగు సమస్యలపై అధికారులకు తగిన సూచనలు అందించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు.

# ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఆటోనగర్‌లోని జువెనైల్ వెల్ఫేర్ కరెక్షన్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎం.జీ.ఎం. అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీ.పీ. యూనిట్) డాక్టర్ ఎం. యశస్విని పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్విని మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించామని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేడి ఆహారం, గుడ్లు, పాలు తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సూపరింటెండెంట్ శ్రీదేవి, ఎంజీఎం హాస్పిటల్ పీ.పీ. యూనిట్ సూపర్‌వైజర్ నర్మద, ఏ.ఎన్.ఎం. ప్రేమలత, రామ రాజేష్ ఖన్నా, ఆశ కార్యకర్త నాగమణి, జి.అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఇళ్లు ధ్వంసం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో నిరుపేదలు పైసా పైసా కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను ధ్వంసం చేయడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై బాధితుడు రూపాని దాసు మీడియాతో మాట్లాడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. రూపాని దాసు చెప్పిన వివరాల ప్రకారం, 2009లో ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి, ఇటీవల అన్ని అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే, మంగళవారం అర్ధరాత్రి మేంగు నాగేశ్వరరావు, నిమ్మల శ్రీను, రేకాపా శ్రీను, రఘు తమ అనుచరులతో కలిసి వచ్చి, ఇంట్లో నిద్రిస్తున్న తమపై మారణాయుధాలతో దాడికి యత్నించారని ఆరోపించారు. ఆ దాడి నుంచి తప్పించుకొని ఇంటి నుంచి పారిపోయామని తెలిపారు. వచ్చిన దుండగుల గుంపు గడ్డపారలు, రాళ్లు కొట్టి గన్‌లతో ఇళ్లను ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేసిందని బాధితులు పేర్కొన్నారు. గతంలో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు నిర్వహించి, ఈ ఇంటి స్థలం తమదేనని తీర్పు ఇచ్చారని తెలిపారు. తమ ఇళ్లను ధ్వంసం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం ఉన్నతాధికారులను వేడుకుంటుంది.

# కేయూలో నూతన రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యార్థి సంఘాల స్వాగతం




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్, యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రాజేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్ మాట్లాడుతూ, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను సీఆర్‌పీఎఫ్ (సీఆర్పీఎఫ్)కు కేటాయించిన స్థలంలో నిర్మించడానికి స్వాగతిస్తున్నామన్నారు. నిన్నటి వరకు యూనివర్సిటీ భూమి విద్యార్థులకు ఉపయోగపడకుండా సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో ఉండటం బాధాకరమని వారు పేర్కొన్నారు. అయితే, ఇప్పుడు అదే స్థలంలో పేద విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేయడం స్వాగతించదగిన పరిణామమని తెలిపారు. కార్పొరేట్ విద్యకు ధీటుగా తీసుకొస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రపంచంతో పోటీ పడే అవకాశం లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, ఈ సందర్భంగా ప్రభుత్వంతో మాట్లాడి కొత్త హాస్టల్ ఏర్పాటుకు, డిపార్ట్‌మెంట్ల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించేలా ఒత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాకేష్, దీక్షిత్ రెడ్డి, ప్రశాంత్, రఘు, రాజేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్ట్ నేత గాజర్ల రవి భౌతిక కాయానికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, టేకుమట్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుమిల్లి కిట్టుకూరు అటవీ ప్రాంతంలో ఈనెల 18న తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ఒడిశా ఏఓబీ దండకారణ్యం ఇంచార్జి గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం వారి స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలంలోని వెలిశాలకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం హాజరై గాజర్ల రవి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ దాదాపు 40 సంవత్సరాల క్రితం గ్రామాల్లో భూస్వామ్య పెత్తందారులు, దొరల ఆగడాలు, పీడిత ప్రజలు పడుతున్న ఇబ్బందులను భరించలేక అజ్ఞాతంలోకి వెళ్లి మావోయిస్టు పార్టీలో చేరారని గుర్తు చేశారు. దళ సభ్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగి ఎన్‌కౌంటర్‌లో మరణించారని ఆమె తెలిపారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పీడిత ప్రజల కోసం పోరాటం చేసి ఎన్‌కౌంటర్లలో మరణించిన మావోయిస్టుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి ఆశయాలు వృథా కావని పుల్లూరి స్వప్న సదానందం అన్నారు.

# కేటీపీపీ ఉద్యోగి పల్లెర్ల నిరంజన్ రెడ్డికి గౌరవ డాక్టరేట్



**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురం మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ప్రముఖ కవి, రచయిత పల్లెర్ల నిరంజన్ రెడ్డికి 2025 సంవత్సరానికి గాను డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్ గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (GHPU) అంతర్జాతీయ యూనివర్సిటీ, యూఎస్ఏ ప్రకటించింది. హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత బొమ్మకంటి రాజేందర్ ఆధ్వర్యంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి విజయ్ మోహన్, నిరంజన్ రెడ్డికి డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్ అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ మాట్లాడుతూ సంఘసేవకులు, రచయితలు, కవులు, అత్యంత ప్రతిభావంతులను గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 28న తమిళనాడులోని చెన్నైలో గల భారతీయ విద్యా భవన్‌లో జరిగే స్నాతకోత్సవంలో నిరంజన్ రెడ్డికి ఈ "హానరరీ డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్" అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవానికి అంతర్జాతీయ స్థాయిలో సుమారు 1000 మంది ప్రతినిధులు హాజరవుతారని యూనివర్సిటీ తెలియజేసింది. నిరంజన్ రెడ్డి అత్యుత్తమ కృషి, విజయాలకు గుర్తింపుగా, గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ అడ్వైజరీ బోర్డు క్షుణ్ణంగా పరిశీలించి ఈ గౌరవ డాక్టరేట్‌ను ఆమోదించినట్లు తెలిపింది. సమాజానికి ఆయన చేసిన అసాధారణ కృషిని ప్రశంసిస్తూ, ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందించడం సంతోషంగా ఉందని జీహెచ్ పీయూ యూఎస్ఏ వ్యవస్థాపకుడు, చైర్మన్ పేర్కొన్నారు.

# మంకీ ఫంకీ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

## ● విద్యార్థి సంఘాల డిమాండ్

**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ రూరల్ మండల పరిధిలోని దేశాయిపేట ప్రాంతంలో అనుమతి లేకుండా నడుస్తున్న మంకీ ఫంకీ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఏఐఎస్ బీ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్), ఏఐఎఫ్ డీఎస్ (ఆల్ ఇండియా ఫోరం ఫర్ డెమొక్రటిక్ స్టూడెంట్స్) విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ ఎంఈఓ (మండల విద్యాధికారి)కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.బీ. జిల్లా కన్వీనర్ రోహిత్, ఏఐఎఫ్ డీఎస్ జిల్లా నాయకులు పోలబోయిన రాజు మాట్లాడుతూ, మంకీ ఫంకీ స్కూల్ పేరుతో అనుమతి లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మంకీ ఫంకీ స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే



స్కూల్‌ను సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఎంఈఓను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దయెత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో పోలీసులపై గౌరవ మర్యాదలను పెంపొందించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** ప్రజలకు నిజాయితీతో సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన తోట వీరస్వామి, కే పోచయ్య, ఎం రమేష్, ఎం సుధాకర్, పి రమేష్ లు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన ఎస్ఐలకు సూచించారు.

# గాజర్ల రవికి వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నివాళి



**వరంగల్ వాయిస్, టేకుమట్ల:** మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. శుక్రవారం ఉదయం గాజర్ల రవి భౌతికకాయం స్వగ్రామమైన వెలిశాలకు చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ వెలిశాల గ్రామానికి వచ్చి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాజర్ల రవి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. అనంతరం, మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నేత గాజర్ల రవి (గణేష్) సోదరుడు, మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ (ఐతు), వారి కుటుంబ సభ్యులతో వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌తో పాటు బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీపతి గోపి, పెరుమాండ్ల అనిల్, శనిగరపు సుమన్, కొడారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌కు ఏటీసీ మంజూరు

## విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

## కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్ హర్షం

**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** హుజురాబాద్ నియోజకవర్గానికి ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) మంజూరు చేయడం పట్ల హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వొడితల ప్రణవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం విద్యారంగంపై అధిక దృష్టి సారిస్తోందని, ఈ సెంటర్ మంజూరు కావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులలోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి, అలాగే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో యువత భవిష్యత్తుపై దృష్టి సారిస్తానని, నిరుద్యోగ యువతీ యువకులకు అండగా ఉంటానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ప్రణవ్ గుర్తు చేశారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## ▪ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** యోగా భారతదేశంలో పుట్టి ప్రపంచవ్యాప్తంగా విస్తరించడం భారతీయులందరికీ గర్వకారణమని, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని వరంగల్ జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఆకుతోట ఇందిరా, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాలసముద్రంలోని చిల్డ్రన్ పార్కులో ఘనంగా నిర్వహించిన యోగా కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యోగా మన ప్రాచీన సంప్రదాయం నుంచి లభించిన అమూల్యమైన బహుమతి అని, ఇది మనసు, శరీరం, ఆలోచనలు, మరియు క్రియల ఐక్యతను సూచిస్తుందని తెలిపారు. “యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు, ఇది మీతో, ప్రపంచంతో, ప్రకృతితో ఏకత్వం అనే భావనను కనుగొనే మార్గం” అని వారు ఉద్ఘాటించారు. యోగా ప్రతి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో సహాయపడుతుందని, ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుతుందని వారు పేర్కొన్నారు. యోగా సాధకులు ధ్యానం చేయడం వలన నిలకడగా ఉండాలని, యోగా సాధనతో మనిషి చురుకుగా ఉండటమే కాకుండా మానసిక ప్రశాంతతను, ఉత్సాహాన్ని పొందుతారని తెలియజేశారు. ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, అల్సర్, ఆస్తమా, వివిధ రకాల నొప్పుల నుంచి విముక్తి కలుగుతుందని వారు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు మానసిక నరాల సమస్యలు రాకుండా నివారిస్తుందని, ఎంత ఎక్కువగా యోగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత అంతగా పెరుగుతుందని, యోగా ఆసనాల వలన రక్తప్రసరణ మెరుగుపడుతుందని సూచించారు. ప్రతి రోజూ యోగా సాధన చేయడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. ప్రతి వ్యక్తి యోగా పట్ల అవగాహనను పెంపొందించుకొని మానసికంగా, శారీరకంగా ఉన్నతంగా ఎదగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ బత్తుల రాజేందర్, లకావత్ చిరంజీవి, సదానందం, శివ శంకర్, రవీందర్, నవీన్, శోభ, కళావతి, సుమ, భాస్కర్, సురేష్, శ్రీనివాస్, సాయిలు, వెంకటేశ్వర్లు, సునిత, గణేష్, మంజుల, విజయ, శ్యామల, రోజా, నయనా తదితరులు యోగా సాధకులు పాల్గొన్నారు.


# సేవే లక్ష్యంగా ఆవోపా అభివృద్ధికి కృషి చేస్తా

## అధ్యక్ష అభ్యర్థి దొంతుల ఈశ్వరయ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఈ నెల జూన్ 22న జరగనున్న ఆవోపా (ఆర్యవైశ్య యువజన పరిషత్) ఎన్నికలలో తనను గెలిపిస్తే, సేవే లక్ష్యంగా ఆవోపా అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఆవోపా అధ్యక్ష అభ్యర్థి దొంతుల ఈశ్వరయ్య తెలిపారు. 2025-27 సంవత్సరానికి గాను అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ఈశ్వరయ్య, తన గత అనుభవాలను, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. తాను 1992 నుంచి కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, 2018లో పదవీ విరమణ పొందానని ఈశ్వరయ్య తెలిపారు. 1980-83 సంవత్సరాలలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టూడెంట్స్ ఆర్గనైజేషన్లలో సహాయ కార్యదర్శిగా, కార్యదర్శిగా పనిచేశానని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం ఉద్యోగ సంఘాలలో వివిధ హోదాలలో పనిచేయడంతో పాటు, వివిధ జాతీయ, ప్రాంతీయ సేవా సంఘాలలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నానని ఆయన అన్నారు. గతంలో అవోపా హనుమకొండ కార్యవర్గంలో సభ్యుడిగా, ఉపాధ్యక్షుడిగా పనిచేశానని, ప్రస్తుతం ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ విభాగానికి చైర్మన్‌గా ఉన్నానని తెలిపారు. అలాగే, అవోపా మిలీనియం ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్‌గా, అన్నపూర్ణ వెల్ఫేర్ సొసైటీ మెంబర్‌గా, వాసవి క్లబ్ మెంబర్‌గా కూడా సేవలందిస్తున్నట్లు వెల్లడించారు.ఈ నెల 22న జరిగే ఆవోపా జిల్లా ఎన్నికలలో అధ్యక్షుడిగా తనను అధిక మెజారిటీతో గెలిపించాలని దొంతుల ఈశ్వరయ్య కోరారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మండలంలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో బీజేపీ జిల్లా నాయకులు, మండల విద్యాధికారుల సమిష్టి సమావేశం శుక్రవారం జరిగింది. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాగే పుస్తకాలు, యూనిఫాంల పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా దోపిడీకి పాల్పడుతున్నాయని బీజేపీ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు డీఈఓ రవీంద్ర రెడ్డి ఆదేశాలతో ఎంఈఓ అంగోత్ లక్ష్మ, కాంప్లెక్స్ హెచ్ఎం బండి నర్సింహా రావు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు లక్ష్మీ నారాయణ వ్యాస్, రాంబాబు, నగేష్ మాట్లాడుతూ, క్వాలిఫైడ్ టీచర్లు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నారని, దీంతో విసిగిన పేద తల్లిదండ్రులు తమ పిల్లలు కూడా పేదరికం అనుభవించకూడదని ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడానికి ఉపయోగించుకోవడం తగదని వారు అభిప్రాయపడ్డారు. విద్య అందరికీ ఆదర్శంగా ఉండాలి కానీ వ్యాపారానికి నిదర్శనంగా ఉండకూడదని స్పష్టం చేశారు. అధిక ఫీజులను అరికట్టేందుకు తక్షణమే కార్యాచరణ తీసుకోవాలని ఎంఈఓ, డీఈఓలను కోరారు. భారతీయ జనతా పార్టీ ప్రజల అవసరాలకు గొంతుకై పోరాడుతుందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని పలు ప్రైవేట్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు, బిల్లులపై ఆందోళన వద్దు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** ఇందిరమ్మ ఇళ్లు రాలేదని, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు అందలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ భరోసా ఇచ్చారు. పర్వతగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని “బంగారు తెలంగాణ” అని చెప్పి అప్పుల పాలు చేసిందని, గడీల పాలనను కొనసాగించి ప్రశ్నించే గొంతుకలను అణచివేసిందని, దొరల పాలన సాగిందని ఆయన విమర్శించారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుబాటులో ఉంచబడ్డాయని తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని, కమిషన్లు లేకుండానే పరిపాలన సాగుతోందని నొక్కి చెప్పారు. అధికారం కోల్పోయిన అక్కసుతో టీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి ప్రవర్తిస్తున్నారని, లబ్ధిదారులకు మాయమాటలు చెప్పి ఆందోళన కలిగిస్తున్నారని శ్రీనివాస్ నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరే విధంగా ఊరూరా తిరుగుతూ సమస్యల పరిష్కారం కోసం అధికారులతో సమన్వయం చేస్తున్నారని, కాబట్టి, ఏ ఒక్క లబ్ధిదారుడు ఆందోళన చెందవద్దని శ్రీనివాస్ నాయక్ కోరారు.

# గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత

## ● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు. తొర్రూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆమె అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అమ్మాపురం గ్రామంలో రూ.22 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైయిన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, పోలేపల్లి గ్రామంలో రూ.8 లక్షలు, మడిపెల్లిలో రూ.10 లక్షలు, ఖానాపురంలో రూ.5 లక్షలు, గుర్తూరులో రూ.10 లక్షలు, జమస్థాన్‌పురంలో రూ.4 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, ఆయా గ్రామాల ప్రజలు చాలా కాలంగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఈ సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణంతో ఆ సమస్యలు పునరావృతం కావని ఆమె భరోసా ఇచ్చారు. మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా గ్రామాల అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నామని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామీణ తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో పరిశుభ్రత, రాకపోకల సౌలభ్యం మెరుగుపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు మిత్తింటి హరీష్, బచ్చలి లక్ష్మణ్, గంధం సతీష్, విక్రమ్ రెడ్డి, రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో సేవల వివరాలను పొందుపరచాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** శుక్రవారం మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ వారు అందించే సేవల ధరల పట్టికను, ఆసుపత్రులలో పనిచేసే డాక్టర్ల వివరాలను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు. పనిచేసే సిబ్బంది వివరాలను, వారి అర్హత సర్టిఫికెట్లను ఆసుపత్రులలో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఒకవేళ సిబ్బందిని గాని, డాక్టర్లను గాని మార్చినట్లయితే, ఆ వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి ముందుగానే తెలియపరచాలని పేర్కొన్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఇచ్చిన సర్టిఫికెట్లను రెన్యూవల్ చేయించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విదేశాలలో ఎంబీబీఎస్ చదువుకొని వచ్చిన వారు భారత ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని, అంతేకాకుండా వారి డిగ్రీలు కేవలం ఎంబీబీఎస్ కు మాత్రమే సమానమని, ఎండీ అని రాసుకోకూడదని ఆయన హెచ్చరించారు. అలాగే, అగ్నిమాపక పరికరాలను తప్పనిసరిగా అమర్చుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్లు అనిల్ కుమార్, రాకేష్ పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీపై చర్యలేవీ?

## ఎంఈఓకు డీఎస్ఎఫ్ఐ మండల కమిటీ వినతి

**వరంగల్ వాయిస్, డోర్నకల్:** మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని, అదేవిధంగా పాఠశాలల్లో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎస్ఎఫ్ఐ డోర్నకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు గుగులోతు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ రోజురోజుకు విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డు అదుపు లేకుండా ప్రతి సంవత్సరం ఫీజులు పెంచుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరి నుండి జలగలా రక్తం పిండుతున్నారని ఆయన మండిపడ్డారు. అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ, లైసెన్స్ లేకుండా దందా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, 25 శాతం పేదలకు ఉచిత విద్య అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బి. నరేష్, సురేష్, నవీన్, ఈశ్వర్, కళ్యాణ్, రామ్ చరణ్, వినయ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# లాభసాటి వ్యవసాయం కోసం ఐక్య పోరాటాలు నిర్మిద్దాం

## ● రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** లాభసాటి వ్యవసాయ విధానం కోసం ఐక్యంగా రైతాంగ పోరాటాలను నిర్మించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లె గ్రామంలో రాత్రి 8 గంటలకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న నష్టాలపై తీసిన ఒక షార్ట్ ఫిలింను ప్రొజెక్టర్ ద్వారా గ్రామ రైతులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన రైతాంగ పోరాటాలు ప్రపంచాన్ని కదిలించాయని, వాటి కారణంగా రైతు వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవలసి వచ్చిందని గుర్తు చేశారు. ఈ పోరాటాలు రైతాంగ పోరాటాల ఆవశ్యకతను దేశ రైతులకు గుర్తు చేశాయన్నారు. తెలుగు రాష్ట్రాలలో రైతాంగ పోరాటాలు చాలా బలహీనంగా ఉన్నాయని, అందుకే ఈ రూపంలో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోని రైతులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ ఈ సభను ఉద్దేశించి మాట్లాడారు. దేశ ప్రజలకు ఆహార భద్రత ఉండాలన్నా, రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నా, యువకులకు పని కల్పించి నిరుద్యోగం తీరాలన్నా లాభసాటి వ్యవసాయమే ఏకైక పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రింది విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ, రైతులకు ఉన్న హక్కులను ఈ ప్రభుత్వాలు అమలు చేయాలంటే, గ్రామ గ్రామాన తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను నియమించుకొని, రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. షార్ట్ ఫిలిం ప్రదర్శన అనంతరం, అక్కడికక్కడే 9 మంది సభ్యులతో గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ రైతాంగానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నేరెళ్ల రాజిరెడ్డి, నల్ల నర్సిరెడ్డి, రైతులు పోగుల రవీందర్, పోగుల సుగుణాకర్, కే. రవీందర్, గుండాల వీరన్న, నేరెళ్ల రాజు, పోగుల నాగరాజు, మహిళా రైతులు, ఇతర రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్పం కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ హాజరయ్యారు. వీరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల కార్యదర్శి దొగ్గల వినయ్, సమన్వయ కమిటీ సభ్యులు కుడ్ల మలహాలరావు, ఈర్ల చిన్ని, పర్నేం మల్లారెడ్డి, పాడి ప్రతాప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి అల్లం శ్రీరామ్, పరకాల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మటి కృష్ణ కాంత్, మండల కాంగ్రెస్ నాయకులు జీల శ్రీనివాస్, ఐలయ్య, సురేష్, నాగరాజు, బొమ్మకంటి చంద్రమౌళి, మంద పరమేశ్వర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు పరకాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రేపు పతంజలి యోగ పరకాల శాఖ ఆధ్వర్యంలో పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి ఏటా యోగా దినోత్సవం రోజున పరకాలలో యోగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా యోగా దినోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గత పదిహేను రోజులుగా పరకాలలోని గణపతి డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రతిరోజూ యోగా గురువు కొలుగూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా తరగతులు జరుగుతున్నాయి. పట్టణానికి చెందిన యోగా సాధకులు పెద్ద సంఖ్యలో ఈ తరగతులకు హాజరవుతున్నారు. జూన్ 21వ తేదీన గ్రేన్ మార్కెట్ ఆవరణలో జరిగే యోగా దినోత్సవ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు జరిగే ఈ యోగా వేడుకలకు అందరూ తప్పకుండా హాజరు కావాలని యోగా గురువు నాగేశ్వరరావు కోరారు.

# కొత్త రేషన్ కార్డుల నమోదుకు ప్రజలు సహకరించాలి

## కార్పొరేటర్ మరుపల్ల రవి విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, తమ కుటుంబ సభ్యుల వివరాల నమోదు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కార్యక్రమంలో అధికారులకు పూర్తిగా సమాచారం అందించి సహకరించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. 40వ డివిజన్ విచారణ అధికారి సీఓ సునీత ఆధ్వర్యంలో ప్రజాపాలనలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరిస్తున్న తీరును కార్పొరేటర్ మరుపల్ల రవి పరిశీలించారు. ప్రతిరోజూ ఉర్సు సీఆర్‌సీ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రేషన్ కార్డులో పేర్లు నమోదు చేసే కార్యక్రమం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ మరుపల్ల రవి విజ్ఞప్తి చేశారు. ఈ విచారణ కార్యక్రమంలో ఆర్పీలు ఎం. సౌజన్య, ఆర్. రాజేశ్వరి, కే. రాధిక, ఎస్. రజిత, స్రవంతి, శ్రీలత, శారద, శోభ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు న్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** తొర్రూరు పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పట్టణానికి చెందిన పలు వార్డుల పేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యశస్విని రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతోందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. పేదల జీవితాల్లో సుస్థిరత తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా పేదల ఇంటి కల నెరవేరుతోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇల్లు కేవలం నివాస స్థలం మాత్రమే కాదని, అది ఒక కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్తు అని అన్నారు. ప్రతి లబ్ధిదారుని జీవితంలో ఇది కొత్త ప్రారంభం అవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయకులు ఎస్. సంతోష్, సోమ రాజశేఖర్, మంగళాపెల్లి రాం చంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, సోమేశ్వర రావు, రాము, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఆత్మకూరు గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలు కొమ్ముల స్వరూప (భర్త కొమురయ్య) నూతన గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, ఆత్మకూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి వెల్దె వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, ప్యాక్స్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్, గ్రామ ప్రధాన కార్యదర్శి అలువాల రవి, మైనారిటీ అధ్యక్షుడు ఎండి ఖాజా, కాడబోయిన రవి, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మంగ రాజు, నాయకులు మార్తా కేదారి, వద్దేపల్లి ప్రసాద్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బరుపట్ల అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌బీ కళాశాలలో యోగా దినోత్సవ ఏర్పాట్లు

◆ పాల్గొననున్న 800 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు




**వరంగల్ వాయిస్, వరంగల్:** స్థానిక లాల్ బహదూర్ కళాశాల (ఎల్‌బీసీ)లోని ఎన్‌సీసీ ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో యోగ ప్రాక్టీస్‌ను నిర్వహించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. యోగా దినోత్సవంపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో కళాశాల నుంచి ములుగు రోడ్డు వరకు ఒక భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. గత 30 రోజుల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లకు యోగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యోగా ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి గుర్తించిన సందర్భంగా, జూన్ 21న కళాశాలలో నిర్వహించే యోగా దినోత్సవంలో నగరంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల నుండి సుమారు 800 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటారని ప్రిన్సిపాల్ వివరించారు. పదవ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కల్నల్ రామదుర్గె, ఏవో లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే పర్యవేక్షణలో ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. యోగా దినోత్సవం కోసం శిక్షణతో పాటు కళాశాల ప్రాంగణాన్ని కూడా శుభ్రం చేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. డాక్టర్ కె. రాజేందర్‌రెడ్డి, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, శివాని, హాస్య బేగం, భాగ్యలక్ష్మి, సాయి గణేష్, హరిలోకేశ్, అచ్యుతానంద, సమీర్, సిరివెన్నెల తదితరులు పాల్గొన్నారు.

# పల్లవి మోడల్ స్కూల్‌పై అసత్య ప్రచారాలు

## ఖండించిన కరస్పాండెంట్ అశోక చారి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని అన్నారం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన పల్లవి మోడల్ స్కూల్‌పై కొంతమంది నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై పాఠశాల కరస్పాండెంట్ అశోక చారి స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ, తమ పాఠశాల ప్రభుత్వ విధివిధానాలకు లోబడి, ప్రభుత్వ పాఠశాలల పాఠ్యాంశాలనే అనుసరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కొంతమంది వ్యక్తులు పాఠశాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అటువంటి నిరాధారమైన ఆరోపణల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. తమ పాఠశాల నాణ్యమైన విద్యను అందించడంలో నిబద్ధతతో ఉందని ఆయన హామీ ఇచ్చారు. 30 సంవత్సరాల అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే తమ విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యత గల విద్యను అందిస్తున్నామని, పాఠశాలకున్న నైపుణ్యం, అంకితభావాన్ని ఈ సందర్భంగా అశోక చారి తెలియజేశారు.

# క్రమం తప్పకుండా చెత్త సేకరించాలి

● పారిశుద్ధ్యంపై మాజీ కౌన్సిలర్ వినతి



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో నెలకొన్న పలు సమస్యలపై మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ కమిషనర్ పేరు మీద ఇన్‌వార్డ్ సెక్షన్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన తన వినతిపత్రంలో స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్తను, వీధులలోని చెత్తను ట్రాక్టర్ల ద్వారా క్రమం తప్పకుండా సేకరించాలని కోరారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి, తీసిన చెత్తను వెంటనే ట్రాక్టర్ల ద్వారా తరలించాలి. రోడ్లు, వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. రిపేర్లలో ఉన్న బోరింగ్‌లను తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. ప్రభుత్వ సిల్క్ ఫారం నుంచి పైడిపల్లి తాటి వనం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్ల వల్ల ప్రయాణికులకు, వ్యవసాయ పనులకు వెళ్లే వారికి ఇబ్బందిగా ఉందని, డోజర్ ద్వారా రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయించాలని కోరారు. వార్డులో ఎల్లర్జీతో ఉన్న కుక్కల ద్వారా ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని, వెంటనే కుక్కల ఏరివేత కార్యక్రమం చేపట్టాలన్నారు. నల్లాల ద్వారా ఇంటింటికి సక్రమంగా నీళ్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల వెంబడి బ్లీచింగ్ చల్లించాలని, శానిటేషన్ పనులు క్రమం తప్పకుండా సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు, కమలాపూర్ మండల కేంద్రంలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘంలో శుక్రవారం నిరుపేద చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ నిర్వహించి, లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గులు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తమ కళ్లల్లో ఆనందంతో కాంగ్రెస్ పార్టీకి, ప్రణవ్ బాబుకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుల్లూరి శ్రీనివాసరావు, విష్ణుదాసు వంశీధర్ రావు, కంభంపాటి ప్రసాద్, ఆన్ కార్ అశోక్, మార్కెట్ డైరెక్టర్ కిన్నెర కృష్ణమూర్తి, మసన చంద్రశేఖర్, వైనాల సాంబయ్యతో పాటు పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# పసుపుకు రూ. 25 వేల మద్దతు ధర ప్రకటించాలి

● ఈనామ్ పద్ధతి రద్దు చేయాలి
● రైతు సంఘాల డిమాండ్




**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ రైతు సంఘం, అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకుల ప్రతినిధి బృందం శుక్రవారం వరంగల్ గ్రెయిన్ మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా మార్కెట్‌లోని పసుపు యార్డులో తమ ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని రైతులు సంఘాల నాయకులతో చెప్పుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఈనామ్ (e-NAM) పద్ధతి ద్వారా వ్యాపారులు ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారని, దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అనుసరించడం ద్వారా రైతులకు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందని అన్నారు. ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా జరిగే ఈ పద్ధతి వ్యాపార వర్గాలకే లాభం చేకూర్చే విధంగా ఉందని వారు తెలిపారు. గతంలో రైతులు తాము తెచ్చిన ఉత్పత్తులకు ఎంత ధర పలికిందో అప్పుడే తెలిసేదని, ప్రస్తుత పద్ధతి ద్వారా రైతుకు తెలిసే పరిస్థితి లేదని వారు ఆరోపించారు. "ఈరోజు ఒక వ్యాపారి సరుకును కొనుగోలు చేయకుంటే, మరొక వ్యాపారి కొనుగోలు చేయడానికి అవకాశం లేదు. మళ్లీ మరుసటి రోజు మాత్రమే రైతు అమ్ముకోవాల్సి వస్తుంది. ఒకవేళ మార్కెట్‌కు సెలవులు వస్తే రైతు తన సరుకుతో అక్కడే పడిగాపులు పడి ఉండాల్సి వస్తుంది. ఇంతకంటే దారుణం మరొకటి లేదు" అని రైతు సంఘాల నాయకులు అన్నారు. రైతుల పరిస్థితి "అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి" లాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనామ్ విధానాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగానే వేలం పాట విధానాన్ని అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే, పసుపు క్వింటాలుకు రూ. 25 వేలు మద్దతు ధరగా ప్రకటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మార్కెట్‌ను సందర్శించిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, మరియు మొగిడే పేరయ్య, బొల్లు ఎల్లయ్య, బరుపటి రవీందర్, చంద్రమౌళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# నాని హిట్ -3 సినిమాకు చిక్కులు

## కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత

నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడిరది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్-1, హిట్-2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్-3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్-3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్-3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంధవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.




# పరీక్ష పెట్టిన కుబేర




ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన తొలి మల్టీస్టారర్, పాన్ ఇండియా మూవీ 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల సైతం నిర్మాణ భాగస్వామి. నాగార్జున, ధనుష్, రశ్మికా మందణ్ణ కీలక పాత్రలు పోషించిన 'కుబేర' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ఉన్నవారికి, లేనివారికి మధ్య వ్యత్యాసం నానాటికి పెరిగిపోతోంది తప్పితే తగ్గడం లేదు. ధనవంతులు మరీ ధనవంతులు అవుతుంటే, బీదవారు ప్రభుత్వాల సబ్సిడీలతో జీవితాల్ని వెళ్ళబుచ్చుతున్నారు. ఈ సబ్సిడీలు రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే తాయిలాలు మాదిరిగా అయిపోయాయి. ప్రభుత్వాధీనంలో ఉండాల్సిన ప్రధాన రంగాలు సైతం నిదానంగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. వాటి ద్వారా కోటాను కోట్లు సంపాదిస్తున్న ఆ కంపెనీలే ప్రభుత్వాలను ఆటాడిస్తున్నాయి. అలాంటి ఓ కార్పొరేట్ టైకూన్ కథే 'కుబేర'. దేశంలోనే అత్యంత ధనికుడైన నీరజ్ మిత్ర (జిమ్ సార్భ్) కు వరల్డ్ రిచెస్ట్ పర్సన్ గా నిలవాలనే కోరిక. దాంతో కేంద్ర మంత్రి సిద్ధప్ప (హరీశ్ పేరడి)తో డీల్ కుదుర్చుకుని లక్షల కోట్ల లంచం ఇచ్చి బంగాళఖాతంలోని ఆయిల్ డిగ్గింగ్ ఏరియాను తన వశం చేసుకుంటాడు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లంచంలో సగం వైట్ లో, సగం బ్లాక్ లో ఇవ్వాల్సి వస్తుంది. దాంతో నిజాయితీతో నడుచుకుని జైలు పాలైన సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్ దీపక్ రాజ్ (నాగార్జున) సాయం తీసుకుంటాడు. అతన్ని జైలు నుండి బయటకు తీసుకొచ్చి... ఈ డీల్ ను ఫుల్ ఫిల్ చేసే పనిని అప్పగిస్తాడు. రంగంలోకి దిగిన దీపక్... నలుగురు బిచ్చగాళ్ళను ఎంచుకుని వారి ద్వారా కథ నడుపుతాడు. అలా వీరు ఎంచుకున్న దేవా (ధనుష్) అనే బిచ్చగాడి కారణంగా పరిస్థితులు చేజారిపోతాయి. ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు నీరజ్ ఇవ్వాల్సిన లక్షల కోట్ల లంచం ముట్ట చెప్పగలిగాడా? వరల్డ్ రిచ్చెస్ట్ పర్సన్ కావాలనుకున్న నీరజ్ కోరిక నెరవేరిందా? తిరుపతిలో బిచ్చగాడిగా ఉన్న దేవా... ప్రభుత్వాలను శాసించగలిగే కార్పొరేట్ టైకూన్ జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేశాడు? అనేది 'కుబేర' కథ.

రాజకీయ నాయకులకు బినామీలు ఉన్నట్టే... కార్పొరేట్ సంస్థలు బినామీలతో షెల్ కంపెనీస్ నిర్వహిస్తుంటాయి. వాటి ద్వారా కోటానుకోట్ల ట్రాన్సాక్షన్స్ చేస్తుంటాయి. ఒకవేళ అవినీతి నిరోధక శాఖ వంటి వారు వీరిని టచ్ చేసినా... చేతికి మట్టి అంటకుండా హాయిగా దులిపేసుకుంటారు. అనామకుల పేర్లతో దందాను సజావుగా నడిపేస్తుంటారు. ఇందులో ఆ అనామకులు నలుగురు బిచ్చగాళ్ళు! అదే ఈ కథలోని కొత్తదనం. దాంతో ఇది కోట్లకు పడగలెత్తిన ఓ మల్టీ మిలియనీర్ వర్సెస్ బెగ్గర్ కథగా మారిపోయింది. వీరిద్దరి మధ్యలో కథను నడిపేది ఓ సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్!! ఇలాంటి ఓ కథను మూడు గంటల సినిమాగా తీసి... ప్రేక్షకులను మెప్పించడం అనేది చాలా కష్టసాధ్యం. దర్శకుడిగా పాతికేళ్ళ అనుభవం ఉన్న శేఖర్ కమ్ముల వల్ల కూడా అది కాలేదు. ఈ మధ్య కాలంలో స్టార్ హీరోలు బిచ్చగాడి పాత్రలు చేయడానికి పోటీ పడుతున్నట్టుగా ఉంది. సినిమా మొత్తం కాకపోయినా.. కొన్ని సన్నివేశాలలో అయినా ఇలా డీ గ్లామర్ గా కనిపించడం జరుగుతోంది. ఇందులోనూ మల్టీమిలియనీర్ అయిన విలన్ తన డబ్బుల్ని కాపాడుకోవడానికి అలాంటి పనే చేస్తాడు. ధనుష్ బిచ్చగాడి పాత్రలో ఒదిగిపోయాడు. అతని నటనను వంక పెట్టడానికి లేదు. నిజానికి ఇందులో ధనుష్ కంటే నాగార్జున పాత్రకే నిడివి ఎక్కువ. అతని క్యారెక్టర్‌రే 360 డిగ్రీస్ ఉంది. తీవ్ర మానసిక సంఘర్షణకు లోనయ్యే ఆ పాత్రను నాగ్ బాగానే చేశాడు. అయితే ఆ క్యారెక్టర్ కు సినిమాటిక్ ముగింపు ఇవ్వడంతో తేలిపోయింది. ఇక రశ్మిక మందణ్ణ పాత్రను చూస్తుంటే 'చూడాలని ఉంది'లో సౌందర్య గుర్తొస్తుంది. ఆమె ప్రమేయం లేకుండానే పలు సంఘటనల్లో ఇరుక్కుపోతుంది. ఈ సినిమా చేయడం కూడా అలాంటిదే అనిపిస్తోంది. నటీనటుల్లో చెప్పుకోవాల్సిన మరో వ్యక్తి జిమ్ సార్భ్. కార్పొరేట్ టైకూన్ గా అదరగొట్టేశాడు. మిగిలిన వారూ సందర్భోచితంగా నటించారు. నాగ్ భార్య పాత్రను సునయన చేసింది. అయితే ఎంచుకున్న కథలో దమ్ములేకపోవడం, దాన్ని సరిగా తెర మీద ప్రెజెంట్ చేయక పోవడంతో ప్రేక్షకులు నిరాశకు గురికాకతప్పదు. సగటు ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని కథను రాసుకుని శేఖర్ కమ్ముల తప్పుచేశారనిపిస్తుంది.




# 8 వసంతాలు... కొత్త ప్రయత్నం

అగ్ర నిర్మాణ సంస్థలు అప్పుడప్పుడూ కొత్తతరంతో... పరిమిత వ్యయంతో కూడిన సినిమాలు కూడా నిర్మిస్తుంటాయి. అలా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి వచ్చిన చిత్రమే... '8 వసంతాలు'. పలువురు కొత్తతరం నటులు కలిసి నటించిన ఈ చిత్రం శుక్రవారం పరేక్షకుల ముందుకు వచ్చింద. ఓ ప్రేమజంట జీవితంలోని 8 వసంతాల కథ ఇది. శుద్ధి అయోధ్య (అనంతిక సనీల్‌కుమార్) అనే యువతి ఓ రచయిత. ఊటీలో ఉంటూ తన టీనేజ్‌లోనే ఓ పుస్తకం రాస్తుంది. దాంతో ఎంతోమంది అభిమానుల్ని సొంతం చేసుకుంటుంది. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ఆమె ప్రావీణ్యం సంపాదిస్తుంది. ప్రయాణాలు, రచనలు, మార్షల్ ఆర్ట్స్‌తో గడుపుతున్న ఆమె జీవితంలోకి వరుణ్ (హను రెడ్డి) వస్తాడు. కొన్ని రోజుల్లోనే ఇద్దరి మనసులు కలుస్తాయి. వరుణ్ తన మనసులోని మాటని చెబుతాడు. శుద్ధి కొంత సమయం కావాలని కోరుతుంది. అందుకు వరుణ్ కూడా అంగీకారం చెబుతాడు. అలా కొన్ని నెలలు గడిచిపోతాయి. ఆ తర్వాత శుద్ధి తన మనసులోని ప్రేమని వ్యక్తపరచాలని ఎంతో ఆత్రుతగా వరుణ్ దగ్గరికి వస్తుంది. మరి వరుణ్... ఆమె ప్రేమని స్వీకరించాడా? ఈ మధ్యలో వరుణ్ జీవితంలో ఏం జరిగింది? వరుణ్ విదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఆమె జీవితంలోకి వచ్చిన సంజయ్ (రవి దుగ్గిరాల) ఎవరు? శుద్ధి ఎనిమిది వసంతాల ప్రేమ ప్రయాణంలో ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయన్నది చిత్ర కథ. 8 వసంతాలు కవితాత్మకంగా సాగే ఓ ప్రేమకథ ఇది. తెరపైన కనిపించే ప్రతి ఫ్రేమ్... ప్రతి సంభాషణ భావుకతని నింపుకొని ఉంటాయి. విజువల్స్ వరకూ కట్టిపడేసినా... ఒక దశ దాటిన తర్వాత సంభాషణలే కృత్రిమంగా అనిపిస్తాయి. దాంతో కథ హృదయాల్ని తాకదు. కథనం నెమ్మదిస్తుంది. కొంతలో కొంత ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. వరుణ్, శుద్ధి కలవడం, ఆ ఇద్దరి మధ్య ప్రేమ చిగురించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. అందంగా కనిపించిన హను రెడ్డి, అనంత మధ్య కెమిస్ట్రీ, హెషామ్ సంగీతం సినిమాని ఆకర్షణీయంగా మార్చేశాయి. అయితే విరామం తర్వాత సినిమా పూర్తిగా గాడి తప్పినట్లు అనిపించింది. ద్వితీయార్ధంలోని ప్రేమకథలో ఏమాత్రం బలం లేకపోగా, చాలా సన్నివేశాలు మెలో డ్రామాని తలపిస్తాయి. సంజయ్ రాసిన రాణిమాలిని అనే వేశ్య కథని చదివి, అతనితో ప్రేమలో పడటం కానీ, ఆ ప్రేమని త్యాగం చేయాలనుకోవడం కానీ ఏమాత్రం సహజంగా అనిపించదు. ప్రథమార్ధంలో శుద్ధి పాత్ర ఎంత బలంగా, ఎంత హుందాగా కనిపిస్తుందో... చివరికి వచ్చేసరికి ఆ పాత్ర తాలూకు ప్రభావం తగ్గిపోతుంది. అనంతిక సనిల్‌కుమార్ అందం, ఆమె నటన ఈ సినిమాకి ప్రత్యేకం. ఆమె స్క్రీన్ ప్రజెన్స్ ప్రేక్షకుల్ని కళ్లు తిప్పుకోనీయకుండా చేస్తుంది. హావభావాలు అద్భుతం అనిపిస్తాయి. లవర్‌బాయ్‌గా కనిపించిన హను రెడ్డి ప్రేమకథలకి తగ్గ హీరో అనిపిస్తాడు. అతని స్క్రీన్ ప్రజెన్స్ కూడా చాలా బాగుంది. భావోద్వేగాలతోనూ మెప్పిస్తాడు. మరో నటుడు రవి దుగ్గిరాల తన పాత్రకు న్యాయం చేశాడు.సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ముఖ్యంగా విశ్వనాథ్ రెడ్డి కెమెరా పనితనం అద్భుతం అనిపిస్తుంది. ఊటీ, కశ్మీర్ అందాల్ని ఆయన తన కెమెరాతో చూపించిన తీరు మణిరత్నం సినిమాల్ని గుర్తు చేస్తుంది. హెషామ్ సంగీతం మరో హైలైట్. దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి కవితాత్మక స్పర్శతో కథని చెప్పాలనుకోవడం మెచ్చుకోదగ్గ ప్రయత్నమే.













# గాజర్ల రవికి కన్నీటి వీడ్కోలు

- పెద్దఎత్తున తరలి వచ్చిన జనం
- అంతిమ యాత్రలో పాల్గొన్న అభిమానులు, సానుభూతిపరులు

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ కి శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. గాజర్ల రవి మృతదేహం ఈ రోజు ఉదయం స్వగ్రామానికి చేరుకోవడంతో స్థానికులు ఒక్కసారిగా ఉద్వేగానికి గురయ్యారు. ఆయన అభిమానులు, మావోయిస్టు సానుభూతిపరులు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో గ్రామానికి తరలివచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. గణేష్ పార్థీవ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## నివాళులర్పించిన సిరికొండ..

శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి వెలిశాల గ్రామానికి చేరుకొని గణేష్ పార్థీవ దేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గణేష్ మృతదేహం ఈరోజు ఉదయం సొంత గ్రామానికి రాగా విషయం తెలుసుకున్న మధుసూదనాచారి వెలిశాల గ్రామానికి తరలి వచ్చారు. వారి సోదరుడు మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ను కలిసి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న దారుణ మారణకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నది వారి జీవితాల్లో అభివృద్ధి, సంక్షేమం కొరకే అని మరువరాదన్నారు. కానీ వారే హత్యాకాండ చేయడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన భారీ బహిరంగ సభలోనూ కగార్ పేరిట మానవ హననానికి పూనుకోవడం వాంఛనీయం కాదని, చర్చలకు ఆహ్వానించి ఆదివాసీలు, నక్సలైట్లు లేవనెత్తుతున్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కేసీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేవారు. అందుకు భిన్నంగా రెట్టించిన కసితో కేంద్ర ప్రభుత్వం తేదీలు ప్రకటించి మరీ ఈ దారుణానికి పాల్పడ్డడం ప్రజలను, ప్రజాస్వామ్య వాదులను కలిచివేస్తుందన్నారు. పరంపరగా సాగుతున్న ఎన్ కౌంటర్లు, మరణాలపై ప్రజల్లో సందేహాలు, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయన్నారు. దేశ విస్తృత ప్రయోజనాల రీత్యా ప్రభుత్వం ఏవైనా నిర్ణయాలు తీసుకున్నప్పుడు, ఆ నిర్ణయం వల్ల ప్రభావితమై కష్టాల పాలవుతున్న వారి ప్రయోజనాలు పరిరక్షించాలే కానీ ప్రభుత్వ నిర్ణయాలను ఆక్షేపిస్తే, నిరసిస్తే నిర్మూలనే సమాధానం అని ప్రభుత్వం భావించడం సమంజసం, సమర్థనీయం కాదన్నారు. ఈ మారణకాండను వెంటనే ఆపి, సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించి నిజానిజాలు నిగ్గు తేల్చాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు.

# సీపీఐ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

### కడియంను కోరిన సీపీఐ నాయకులు

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అర్హులైన సీపీఐ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరుతూ ఆ పార్టీకి చెందిన నాయకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐలో ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీపీఐ నాయకులు ప్రాతిపదించిన 75మందికి ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.






# మెడికల్ హబ్ గా వరంగల్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పాలనలో వరంగల్ మెడికల్ హబ్ గా రూపుదిద్దుకుంటోందని, అన్ని రకాల సేవలతో ప్రత్యేకంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాకతీయ మెడికల్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ ను స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణితో కలిసి డాక్టర్ కడియం కావ్య శుక్రావారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితమవకుండా పరిశోధనలపై దృష్టి సారించేందుకు ఈ యూనిట్ దోహదం చేస్తుందని తెలిపారు. యూనిట్ ద్వారా పరిశోధనలు చేపడితే వైద్యశాస్త్ర పురోగతి మరింత సుసాధ్యం అవుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు కడియం కావ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయ లక్ష్మి–సురేందర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాంకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com